క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

నెల్లూరు (అర్బన్): సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన సదస్సును నగరంలోని డీకే డబ్ల్యూ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సైబర్ అనాలసిస్ వింగ్‌కు చెందిన ఎస్సై సురేష్‌బాబు, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధిక శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు

నెల్లూరు సిటీ: అధిక శబ్దం చేసే సైలెన్సర్లను వినియోగిస్తే ఉపేక్షించబోమని, వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని ఏఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి అధిక శబ్దం చేసే సైలెన్సర్లను వినియోగించిన 420 వాహనాలను గుర్తించి తొలగించారు. వీటిని మాగుంట లేఅవుట్లోని అవుట్‌పోస్ట్ వద్ద జేసీబీతో తొక్కించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని చెప్పారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లను విక్రయిస్తున్న దుకాణ యజమానులు, వాటిని బిగిస్తున్న మెకానిక్‌లపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుబాన్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, సౌత్ ట్రాఫిక్ ఆర్ఐ రమణారెడ్డి, ఎస్సై రంగనాథగౌడ్, గీతారమ్య, ఆర్ఎస్సైలు చంద్రమౌళి, తిరుమలరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవస్థాన ఈఓగా శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఇన్‌చార్జి ఈఓగా వెంకటశ్రీనివాసులురెడ్డి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. వెంకటగిరిలోని పోలేరమ్మ దేవస్థాన ఈఓగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన ఇన్‌చార్జిగా బాధ్యతలను చేపట్టారు. వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఈఓ గిరికృష్ణ నుంచి బాధ్యతలను స్వీకరించారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంట రోడ్డులోని బట్టీలవారివీధికి చెందిన నరేంద్ర కరెంటాఫీస్ సెంటర్‌లోని అభినవ్ మోటార్స్‌లో ఫైనాన్సియర్‌గా ఏడాది నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ బైక్‌లో వచ్చి కార్యాలయ ఎదుట నిలిపేవారు. ఈ క్రమంలో ఈ నెల ఏడున తన బైక్‌ను నిలిపి విధులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో బాలుడి అరెస్ట్

నెల్లూరు సిటీ: సెల్‌ఫోన్లను చోరీ చేసిన కేసుల్లో బాలుడ్ని సంతపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నగరానికి చెందిన ఓ బాలుడు రెండు సెల్‌ఫోన్లను చోరీ చేశారని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అరెస్ట్ చేసి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

స్పాల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు



నెల్లూరు సిటీ: కొందరు వ్యక్తులు స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండగా, పోలీసులు దాడులు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నగరానికి చెందిన ఓ ఏఎస్సై కుమారుడు మహేష్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కృష్ణ స్నేహితులు. మాగుంట లేఅవుట్, రామ్మూర్తినగర్‌లో బ్యూటీ పార్లర్ అండ్ స్పా సెంటర్లను నిర్వహిస్తున్నారు. ముంబై, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, విజయవాడ, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి, వీరితో మసాజ్‌తో పాటు అసాంఘిక కార్యకలాపాలను చేయించేవారు. సమాచారం అందుకున్న ఎస్పీ విజయారావు సూచనల మేరకు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఐడీ పార్టీ సిబ్బంది నిఘాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ తన బృందంతో కలిసి రెండు స్పా సెంటర్లపై దాడులు చేశారు. మాగుంట లేఅవుట్లోని స్పాలో మేనేజర్‌గా అలంకార్ సెంటర్‌కు చెందిన సుదీప్, ఢిల్లీకి చెందిన ఓ యువకుడు రిసెప్షనిస్ట్‌గా పనిచేయడాన్ని పోలీసులు గుర్తించారు. స్పా సెంటర్‌లోని నలుగురు యువతులను అదుపులోకి తీసుకొని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామ్మూర్తినగర్‌లోని బ్రాంచ్‌లో మేనేజర్‌గా కొడవలూరు మండలం రేగడిచెలికకు చెందిన విజయ్ పనిచేస్తున్నారని పోలీసులు గుర్తించారు. అక్కడ ఓ యువతిని అదుపులోకి తీసుకొని బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిల్డ్రన్స్‌పార్క్ సెంటర్‌లోని స్పాలో కలిగిరి మండలానికి చెందిన మంజునాథ మేనేజర్‌గా పనిచేస్తున్నారని గుర్తించారు. ఇక్కడ ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకొని బాలాజీనగర్‌కు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దర్గామిట్ట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు సీతారామయ్య, రాములునాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన సంతృప్తికరం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని నాలుగేళ్ల ప్రభుత్వ పాలన సంతృప్తికంగా సాగిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కోడూరు బిట్ – 2 సచివాలయ పరిధిలోని పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి శుక్రవారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, మండల స్థాయి అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల కరదీపికను మంత్రి అందించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. గతంలో గ్రామాలకు వెళ్లిన సందర్భాల్లో ప్రజల నుంచి అనేక సమస్యల కుప్పలుగా వచ్చేవన్నారు. ప్రస్తుతం ఏ గ్రామంలోకి వెళ్లినా సాంకేతిక కారణాలతో నిలిచిన కొన్ని సంక్షేమ కార్యక్రమాల మినహా సమస్యలు ఎక్కడా కనిపించడంలేదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు వివిధ అభివృద్ధి పనులను చేపట్టడమే దీనికి నిదర్శనమని తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లే రోడ్లు.. రైతులు పంట పొలాలకు వెళ్లే రహదారులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. నాలుగేళ్లలో ఒక్కో గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు వెచ్చించామని వివరించారు. ఆక్వా రైతులకు సంబంధించి గతంలో ఉన్న రూ.1.5 సబ్సిడీని ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అంటూ తేడా చూపకుండా పదెకరాల్లోపు సాగు చేసే రైతులకు ఇదే తరహాలో అందించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కావల్‌రెడ్డి సోదరుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి దిలీప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శంకరయ్యగౌడ్, నేతలు రవీంద్రరెడ్డి, రంగారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బుజ్జిరెడ్డి, మండల వైస్ ఎంపీపీ నీలమ్మ, సర్పంచ్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు): ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊటుకూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను గడప గడపకూ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. అన్ని పథకాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు మాట తప్పారని విమర్శించారు. విప్లవాత్మకమైన మార్పులను గమనించి జగనన్నకు అండగా నిలవాలని కోరారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు నవీన్ కుమార్‌రెడ్డి, యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభానురెడ్డి, అచ్యుత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్లు లక్ష్మీనరసారెడ్డి, సర్పంచ్ శేషమ్మ, ఎంపీటీసీ శేషమ్మ, విజయ్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి కానుకల సమర్పణ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి కానుకలను భక్తులు సమర్పించారు. వీటిని హుండీలో వేసిన అనంతరం ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడారు. అమ్మవారికి బంగారు ముక్కుపుడక, మంగళసూత్రంతో పాటు వెండి గిన్నెను భక్తులు అందజేశారని, వీరి అభ్యర్థన మేరకు హుండీలో వేశామని పేర్కొన్నారు. ఈఓ వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

మంత్రి కాకాణి రాక నేడు

ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరుకు శనివారం ఉదయం రానున్నారని ఎంపీడీఓ ప్రత్యూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్య కళాశాలలో నిర్వహించనున్న ఆసరా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు.

విద్యా నరసింహుడు.. కోదండరాముడు



సూర్యప్రభ వాహనంపై కోదండరాముడి విహారం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో కొలువైన కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు శుక్రవారం స్వామి వారు హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపారు. స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఉదయం దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట ఎంపీడీఓగా నాగేంద్రబాబు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. చేజర్ల ఎంపీడీఓగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న కల్పన కోవూరు ఈఓపీఆర్డీగా వెళ్లారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు: స్థానిక శాంతినగర్ ఫీడర్‌లోని అన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ సతీష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుమ్మళ్లదిబ్బ నుంచి శాంతినగర్, తాలూకా ప్రాంగణం, ఏసీసీ కల్యాణ మండపం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముగిసిన టీ - 20 క్రికెట్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించిన టీ – 20 క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. బుజబుజనెల్లూరులోని సీఎంఏ, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ క్లబ్‌లకు చెందిన 50 జట్లు పోటీపడ్డాయి. ఏఎల్ఎమ్సీసీ, లార్డ్స్ సీసీ జట్ల మధ్య ఫైనల్స్ జరగ్గా, ఏఎల్ఎమ్సీసీ జట్టు విజయం సాధించింది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్ బహుమతులను అందచేశారు. క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి, కోశాధికారి అబూబకర్, సంయుక్త కోశాధికారి మునిగిరీష్, మాజీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులను సాధించాలి



కోవూరు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులను సాధించాలని ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ కోరారు. మండలంలోని వేగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజను పదో తరగతి విద్యార్థులు శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు భోజన సదుపాయాన్ని శాంతమ్మ జ్ఞాపకార్థం శ్రీనివాసులు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



కోవూరు(కొడవలూరు): మండలంలోని గండవరం ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను శుక్రవారం అందజేశారు. సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు సునీల్, నిశ్చల్ వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



పొదలకూరులో..



ముత్తుకూరులో..

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సరస్వతీ పూజను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కాంక్షించారు.

ముత్తుకూరు: ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో సరస్వతీ పూజను వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు తమ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లను సరస్వతి విగ్రహం వద్ద ఉంచి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు చెంచురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌బాబుకు సన్మానం



ముత్తుకూరు: మండల తహసీల్దార్‌గా పది నెలల పాటు పనిచేసిన మనోహర్‌బాబు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ సుగుణ, ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓ జ్యోత్స్నరాణి, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



హాల్ టికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కాంక్షించారు. విడవలూరు మండలం ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హాల్‌టికెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. సరస్వతీ పూజలో పాల్గొని విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. స్థానిక నేతలు విజయభానురెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, విద్యాకమిటీ చైర్మన్ అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సుదర్శన్

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్ పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కాగోళ్లపాడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. డీటీ విజయ్, ఈఓపీఆర్డీ శ్యామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

పొదలకూరు: యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని నేదురుమల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై కరిముల్లా కథనం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన వినోద్‌కుమార్ సోదరితో అదే కాలనీకి చెందిన నరేంద్ర అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయమై నరేంద్రతో వినోద్‌కుమార్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో నరేంద్ర తన స్నేహితులతో కలిసి మాతమ్మ ఆలయం వద్ద వినోద్‌కుమార్ కోసం కాపుకాసి రాళ్లతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు గమనించి కేకలేయడంతో నిందితులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బాధితుడ్ని చికిత్స నిమిత్తం పొదలకూరు సీహెచ్‌సీలో చేర్పించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



పొదలకూరులో..



మనుబోలులో..

పొదలకూరు: శ్రీరామనవమిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

- పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

మనుబోలు: మండలంలోని కొండూరుసత్రంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సీతారాములకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మనుబోలు: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ వజ్రమ్మ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె పొదుపు మహిళలకు అందుతున్న వివిధ రకాల రుణాలపై ఏపీఎం వనజాక్షితో చర్చించారు. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు, ఆసరా ద్వారా పంపిణీ చేస్తున్న నగదు వివరాలను తెలుసుకున్నారు. మనుబోలులో ఆసరా చెక్కులను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పంపిణీ చేయనున్నారని తెలిపారు.

నగదు ప్రోత్సాహకాల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యలో ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నాగపద్మ మాట్లాడారు. విద్యార్థులకు నగదు బహుమతులను పాళెం మంగమ్మ ట్రస్ట్ ద్వారా శ్రీనివాసులురెడ్డి అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం పది మంది విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున అందజేశారు.

ఊటుకూరులో గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

కోవూరు(విడవలూరు): గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని ఊటుకూరులో శనివారం నిర్వహించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.